# కలయిదనీ నిజమిదనీ తెలియదులే

శ్రీనాథ్ జొన్నవిత్తులా

ప్రియమైన జానకీ,

నిన్న అర్ధరాత్రికి ఇక్కడికి చేరుకున్నాను. ఎంత పెద్ద ఏర్పోర్టో! పదిగంటల సేపు ప్రయాణం చేసి అలసిపోయినా, బయటికి రాగానే ఆశ్చర్య పోవాల్సిందే. మన ఊళ్ళో లాగా ప్లేను దిగగానే పెద్ద లైనులు, క్యూలు ఏమీ లేవిక్కడ. అంతా చాలా advanced వీళ్ళు. వీసా ఇచ్చినప్పుడు పాస్పోర్ట్లో కాగితం అతికించారే, దాన్లోనే microchip ఉంటుందట; ప్లేను దిగుతూండగానే అది వాళ్ళు కంప్యూటర్లతో scan చేసేసి మళ్ళీ ఆపకుండా పంపించేస్తారు!

నా స్నేహితుడు మహేష్ఏర్పోర్టుకొచ్చి తన ఇంటికి తీసుకెళ్ళాడు. హాయిగా మనపూరి భోజనమే వడ్డిమ్చాడు, తినేసి పడుకొని ఇప్పుడే లేచాను. ఇవాళ్ళ శనివారం కాబట్టి కొంచం తీరికగా లేవ వచ్చు. సోమవారం నుంచీ పనిలో చేరాలి! వాళ్ళే క్వార్టర్స్ కూడా ఇస్తామన్నారు, దానిసంగతి కూడా చూడాలి. రాత్రికి మళ్ళీ email చేస్తాను!
ఇట్లు , కృష్ణ

ooooooooooooooooooooooooooooooo

ప్రియమైన కృష్ణా,

నీ email వచ్చేదాకా నాకు ఏమి తోచకుండా ఉండింది. ఏం అంత ఆలస్యం!? నేనిక్కడ నీ email కోసం ఎదురుచూస్తూ ఉంటానని మరచిపోయావా, అప్పుడే? అసలు అంత దూరం ఉద్యోగానికి వెళ్ళవలసిన అవసరం ఏమిటి? మనవూళ్ళోనూ ఉంది గదా మైక్రోసాఫ్ట్ నీకొచ్చిన గ్రేడ్స్ అవీ చూసి వాళ్ళు పిలిచి మరీ ఉద్యోగమిస్తామంటే వద్దని విదేశాలకి వెళ్ళకబోతేనే!? కాలేజిలో ఉన్నన్నాళ్ళూ మనం రోజూ కలుస్తూ ఉండే వాళ్ళం, కానీ చదువూ, పరీక్షలూ, వీటితోనే సమయమంతా గడచిపోయేది. అదయిపోయిందనుకుంటే ఇప్పుడు ఈ గతేమిటి! నాకిదేం నచ్చలేదు.

ఇట్లు , జానకి

ooooooooooooooooooooooooooooooo

కోప్పడకు జానకి, నాకు మాత్రం నిన్ను విడిచి వుండడం సరదానా?! కాని వృత్తిలో పైకెదగాలంటే మనవూళ్ళో ఉన్న చిన్న చిన్న ఆఫీసుల్లో పనిచేస్తే పనికిరాదు. ఇక్కడ మైక్రోసాఫ్ట్‌వాళ్ళ కేంద్రం ఎంత పెద్దదనుకున్నావు! 6000 మంది పనిచేస్తారట. అసలు ఆ కాంపౌండ్లోకి అడుగు పెట్టగానే వేరే ప్రపంచంలోకి వెళ్ళిపోయినట్లుంటుంది. ఈ ఊరి సంగతయితే చెప్పనే అఖరలేదు! ఎక్కడ చూసినా ఎత్తైన skyscraperలు, విశాలమైన భవంతులు, shopping mallలు (వీటిని నువ్వొకసారి చూస్తే మనవూళ్ళో ఉన్న malls ఎంత చిన్నవో నీకే తెలుస్తుంది!).

విదేశాలనుంచి వచ్చినవాళ్ళకి ఇక్కడ dormitories ఇస్తారు. ఇళ్ళుకూడా వుంటాయనుకొ, కానీ నేనొక్కడినేగదా, అంత డబ్బు కర్చెందుకని వద్దనుకున్నాను. dormitoryలొ చాల మటుకు మన దేశంవాళ్ళూ, చైనావాళ్ళూ ఉన్నారు. కానీ చాలా మంది మన దేశంవాళ్ళకి ఈ భాష కూడ సరిగా మాట్లాడడం రాదు. చాలా accent తో మాట్లాడతారు, ఇక్కడవాళ్ళకి అర్థంకూడా కాదు పాపం. మనకీ కొంత ఆక్సంటుందనుకో, కానీ చిన్నప్పటినుంచీ అలవాటు కాబట్టి కాస్త పరవాలేదు. నీకుకూడా ఇక్కడికొస్తే ఏమీ problem ఉండదులే!

ఎంతైనా, మనవాళ్ళతో కలసివుండడం కాస్త మంచిదే అయింది! ఇంటి కబుర్లు , మనవూరి sports కబూర్లూ అవీ చెప్పుకోవచ్చు. ఇక్కడా sports పిచ్చి బాగానే వుందిగాని వీళ్ళాడే ఆటలు నాకసల అర్థమే అవ్వటల్లేదు!

కృష్ణ

ooooooooooooooooooooooooooooooooooo

Dear కృష్ణా,

ఏమిటంత తేలికగా "నువ్వుకూడా ఇక్కడికొస్తే" అంటున్నావు! అలా ఊరికే అంతతేలికగా ఏమీ రానమ్మ! మా నాన్నకి అసలే ఆ దేశమంటే గిట్టదు. వినే వాళ్ళు దొరికితే వదలకుండా పట్టుకుని దంచేస్తారు. ఒకప్పుడు మనదేశం ఎంతగొప్పది గా వుండేది,

ప్రపంచమంతటినుంచి ఇక్కడికి చదువులకీ, ఉద్యోగాలకీ వచ్చేవారు, ఇప్పుడిలా తయారై ఇక్కడివాళ్ళు విదేశాలకి వెళ్ళవలసిన గతి పట్టిందని. కానీ రోజంతా నా బాధ భరించలేక మొన్న మా అమ్మకూడా ఇదే మాట అందిలే! నువ్వుకూడా అక్కడేమైనా ఉద్యోగం దొరుకుతుందేమో చూసుకోమని. ఇక్కడ Oracle లో ఉద్యోగాలకి interviews వస్తున్నాయి. పని బాగా చేసేవాళ్ళని విదేశాలకి పంపిస్తారట. ఏమంటావు, ప్రయత్నం చేయనా?

జానకి

oooooooooooooooooooooooooooooooooooo

జానకీ,

Good idea! తప్పకుండా వెళ్ళి interview జాగ్రత్తగా చేసి రా. ఇక్కడ మా కంపెనీకి దగ్గరలోనే ఉంది ఒరక్ల్ వాళ్ళ ఆఫీసు – నువ్వుకూడ ఇక్కడికొస్తే హాయిగా మనిద్దరం కలిసే ఉండచ్చు.

ఇక్కడ అన్నీ బానే ఉన్నాయిగానీ ఎంతైనా వాళ్ళదేశం వాళ్ళకే మంచి assignments అన్నీ వస్తాయనుకుంటా! విదేశాలవాళ్ళైతే ఏదో ఇక్కడ రహస్యాలన్నీ తెలుసుకొని వెళ్ళిపోతారన్న భయమేమో, మరి. కొన్నేళ్ళు ఇక్కడుంటే గానీ నమ్మకం కుదరదేమో! ఆఫీసు బయటకూడా పెద్దగా మనతో కలవరు. ఒకవిధంగా చూస్తే వాళ్ళనీ మనం బ్లేం చెయ్యలేం . . చాలా మందికి అసలిక్కడి భాష కూడా సరిగ్గ మాట్లాదటం రాదు, పైగా వాళ్ళ పేర్లుకూడా చిత్రంగా ఉంటాయి (ఇక్కడివాళ్ళకి) . మన అదృష్టం కొద్దీ (లేక మన తలిదండ్రుల ముందుచూపు కొద్ది) మన పేర్లు వీళ్ళకి పలికేట్టుగా తేలికగానే ఉన్నాయి . .

నిన్న మా బాస్‌హరిగారు ఇంటికి భోజనానికి పిలిచారు. ఆయనా మన దేశం వాడే, కాని ఇక్కడికొచ్చి దాదాపు పాతికేళ్ళవుతోంది. బాగా కలసిపోయాడు ఈ దేశంలో. ఇక్కడమ్మాయిని కూడా పెళ్ళిచేసుకొన్నాడు. ఆ అమ్మాయి తలిదండ్రులకి ఈ సంబంధం అస్సలు నచ్చలేదట! (ఇక్కడవాళ్ళేదో చాలా advanced అనుకుంటాము గాని, ఇక్కడా చిన్న ఊళ్ళనించి వచ్చిన వాళ్ళు కొంచం చాదస్తులే) . వీలైనంతవరకూ ఈ

సంబంధం చెడకొట్టడానికి ప్రయత్నించారట. . కానీ తెలుగు సినిమాలలో చూపించేట్టు, నేను పెళ్ళంటూ చేసుకుంటే అతనినే చేసుకుంటానని పట్టుపట్టి ఒప్పించిందట! కానీ ఏం లాభం! కొన్నేళ్ళలోనే ఇద్దరికీ పడక డైవోర్స్‌చేసేసుకున్నారు. వాళ్ళకొక అమ్మాయికూడా వుంది . . శైలజ. ఇప్పుడు వాళ్ళ నాన్నదగ్గరుంటూ ఇక్కడ engineering collegeలో చదువుతోంది. చాలా మంచిపిల్ల. మన దేశం గురించి చాలా ప్రశ్నలడిగింది. వాళ్ళ నాన్న చెప్పేవన్నీ నిజమో కాదో తెలుసుకోడానికి కాబోలు! మన దేశం గురించి నేనూ చాలా గొప్పగా చెప్పాను. ఒకప్పుడు మనదేశం అన్నిదేశాలకన్నా గొప్పదనీ, ఎన్నెన్నో scientific discoveries ఇక్కడే చేశారనీ, అన్నిచోట్లనుంచీ ఎంతోమంది విద్య కోసమూ, ధనంకోసమూ వచ్చి పోతూవుండేవారనీ చెప్పాను. శైలజ ఆశ్చర్యబోతు అలాగా? నిజంగానా? అంటూ నన్ను ప్రోత్సాహిస్తూ కూర్చుంది. హరిగారు బుద్ధదేవుడిలా చిరునవ్వుతో చూస్తూ కూర్చున్నారు . .

కృష్ణ

ooooooooooooooooooooooooooooooooooooo

Dear కృష్ణా,

ఇదిగో, ఇక్కడినుమ్చి వెళ్ళి నెలరోజులు గాలేదు, అప్పుడే అక్కడి అమ్మాయిల్తో పెట్టుకుంటే నాకు కోపం వస్తుంది! అక్కడి ఆడవాళ్ళసంగతి మనకందరికీ తెలిసిందే . . మెత్తగా మాట్లాడి వలలో వేసుకుంటారు! మీ బాసుకి పట్టిన ఖర్మమే నీకూ పడుతుంది జాగ్రత్త! వాళ్ళ మాటలేమీ నమ్మకు!

ఇక్కడ ఇంటర్వ్యూ బాగా అయింది. ఇప్పుడే వాళ్ళదగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. Good news!! నాకు ఉద్యోగం వచ్చింది! వచ్చే సోమవారమే చేరమంటున్నారు. అంతా సరిగ్గా జరిగితే త్వరలోనే అక్కడికి వచ్చేయవచ్చు!

జానకి

ooooooooooooooooooooooooooooooooooooo

జానకీ, జానకీ, ఎందుకింత ఉడుకు! ఇంతమంచి జానకి ఉండగా, నాకు వీళ్ళవెంట పడాల్సిన గతేమిటీ! పిచ్చిపిచ్చి ఆలోచనలేమీ పెట్టుకోకు! అయినా, నా బాసు కూతురితో పెట్టుకోడానికి నాకేమైనా పిచ్చా!

నిన్న మా group అంతా కలిసి హరిగారితో బార్‌కి వెళ్ళాం. ఇప్పుడిదాక చేస్తున్న project పూర్తైనందుకు చిన్న celebration అనమాట. నేను project ఐపోవస్తోందనగా చేరాను గాని నన్ను కూడా కలుపుకున్నారు. హరిగారు ఒక రెండు మూడు డ్రింకుల తరవాత మాట్లాడటం మొదలుబెట్టారు. మొదట్లో అతనికి కూడా పెద్ద assignments ఏమి ఇచ్చేవాళ్ళు కాదట. కొన్నేళ్ళ తరవాత, ముఖ్యంగా "పచ్చపత్రం" వచ్చాక, కంపెనీవాళ్ళకి కాస్త నమ్మకం పెరగడం మొదలయిందట. ఈ పచ్చపత్రం గురించి మిగతావాళ్ళు కూడా చెప్పడం మొదలుబెట్టారు. ఇదివస్తే చాలు, ఇక ఏమీ చింతలేకుండా హాయిగా ఉండవచ్చని! ఇది వచ్చాక మనం ఉద్యోగాలు మార్చగలమని తెలిసి కంపెనీవాళ్ళు మనకి అతిమర్యాదిచ్చి జాగ్రత్తగా చూసుకుంటారట! కానీ అది రావడానికి మూడేళ్ళదాకా పట్టవచ్చునట. మిగతావాళ్ళందరూ ఎప్పుడో అప్లయి చేసేశారట. నన్నుకూడా తొందరగా అప్లయి చెయ్యమని హరిగారు గట్టిగా చెప్పారు. రేపే దీనిసంగతి చూడాలి!

కృష్ణ

oooooooooooooooooooooooooooooooooooo

సారీ, కృష్ణ, ఈ సారి వ్రాయడం లేటైయింది. Oracle చూడ్డానికి చాలా పెద్ద కంపెనీ. 3000 మంది పనిచేస్తారట ఈ కేంద్రంలో. నేనేదో క్లాసులో చాలా గొప్పదాన్ని అనుకునేదాన్ని. కాని ఇక్కడ పనిచెయ్యాలంటే చాలా నేర్చుకోవాలి. మా బాసు చాల మంచివారిలా వున్నారు. నాకంతా జాగ్రత్తగా చూపించి, ఏం కావాలన్నా నిర్భయంగా వచ్చి అడగమన్నారు. ఇక్కడందరూ రోజుకి పది పన్నెండు గంటలు పనిచేస్తారు . మా బాసయితే రోజూ రాత్రి పన్నెండింటిదాకా ఉంటాడట! ఎందుకంటే . . . రాత్రి పదిన్నరకి వాళ్ళ బాసు ఫోన్‌చేస్తాడట! ఈపాటికి నీకర్థమయ్యే ఉంటుంది నా గొడవ . . వాళ్ళ బాసు ఈ దేశంలో లేడు, మీ పక్క బిల్డింగులో ఉన్నాడట!

పాపం నిన్న మా బాసుని చూస్తే జాలేసింది. వారంరోజుల నించీ మా గ్రూపంతా కలసి చేసిన ప్రాజెక్టు పరదేశపు బాసుకి నచ్చలేదట. మళ్ళీ అంతా తిరిగి చెయ్యాలి. చాలా కోపంగా ఉన్నాడు. ఇదంతా చూస్తుంటే నాకూ అక్కడికి వచ్చేయ్యాలని వుంది, కృష్ణ. ఇక్కడచేసేవంతా చిన్న చిన్న పనులే. Design అంతా అక్కడ చేసి ఇక్కడ మమ్మల్ని కూలీల్లాగా వాడుకుంటారు!

జానకి

oooooooooooooooooooooooooooooooooooo

జానకీ,

ఇక్కడ నాకుకూడా పని చాల ఎక్కువగా వుంది, జానకి. కానీ నీ email చూసి నాకు కొంచం నవ్వొచ్చింది. ఈ మాట నేనుముందే చెప్పానుగదా .. నువ్వు నమ్మలేదు. పరవాలేదులే, నీకే తెలిసొచ్చింది. నువ్వుకూడా వీలయినంత తొందరగా ఇక్కడికొచ్చే ప్రయత్నం చెయ్యి. నీ పాస్పోర్టూ అవీ తెప్పించి అట్టేబెట్టుకో.

ఇప్పుడు మీ నాన్నగారేమంటున్నారు! ఈ కథ ఆయనకి చెప్పావా!

కృష్ణ

oooooooooooooooooooooooooooooooooooo

కృష్ణా,

నాన్నగారి సంగతి నీకు తెలుసుకదా! వాళ్ళని పట్టుకు తిట్టేసారు. నాన్న కొంచెం రేసిస్ట్ లే. "ఈ కూలీవెధవలు .. పోనీగదానని మనదేసం రానిచ్చి చదువుకోనిచ్చాం, అదే మనం చేసిన పొరపాటు! జాగ్రత్తగా మనం చేసేవన్నీ చూసి, నేర్చుకుని, ఇప్పుడు మనకే పాఠాలు చెప్పిస్తున్నారు" అంటారు. పాపం .. వాళ్ళ నాన్న (అంటే తాతయ్య) ఒకప్పుడు IBM లో చాలా పెద్ద పదవిలో ఉండేవారట. ఇరవై అయిదేళ్ళు అదే కంపెనీలో ఉద్యోగం చేసేవారట. ఒక రోజు sudden గా వార్త వచ్చిందట – వాళ్ళ కేంద్రం మొత్తం మూసేసి ఆ ఉద్యోగాలన్నీ ఇండియాకి పంపించారట! అప్పడ్నించీ మా నాన్నగారికి అసలు ఇండియన్స్అంటే గిట్టదు. కానీ ఏం చెయ్యగలరు, పాపం! ఒక పక్కన మన దేశం గొప్పతనం తగ్గిపోతూవుంటే, అక్కడ వాళ్ళ దేశం రోజురోజుకీ ఇంకా ఇంకా ముందుకెళిపోతోంది. ఇక వాళ్ళతో సమానత్వం పొందటం మనకి సాధ్యమయే పని కాదు. మనందరమ్ఇక పైకి రావాలంటే ఇండియా వెళ్ళక తప్పదు!

నాన్నగారికి అసలు అన్నిటికంటే బాధాకరమైన విషయం ఏమిటంటే .. మనం అసలు ఇంట్లో కూడా ఇంగ్లీషు మాట్లాడకుండా తెలుగే మాట్లాడతామని! ముద్దుగా వాళ్ళు పెట్టిన నా పేరు Jane కూడా తెలుగులో బాగా కలిసిపోవడానికి జానకిగా మార్చుకున్నాను!

పాపం నేం చిన్నప్పుడు చాలా ప్రయత్నం చేశారు మా నాన్న – నన్ను Jane అనే పిలవటం, నాతో ఇంగ్లీషులోనే మాట్లాడటం. కానీ స్కూలికెళ్ళినప్పుడ్నుంచీ ఇక స్నేహితులందరితో తెలుగులోనే మాట్లాడటం అలవాటయ్యింది . .

ఏమైనా మంచికే అయ్యిన్ది లే! ఇప్పుడు నీతోబాటు నేనుకూడా హైదెరాబాదు వచ్చేశాక అక్కడ ఏమీ కష్టం లేకుండా ఆ భాష వచ్చేసే వుంటుంది.
జానకి
ooooooooooooooooooooooo

నిజమే జానకీ, ఇక్కడి వాళ్ళు మనదేశంలో కన్నా చాలా advanced గా ఉన్నారు. మీ నాన్న కబుర్లు వింటోంటే మా తాతయ్య చెప్పే కబుర్లు గుర్తొస్తున్నాయి. ఆయన కూడా నన్ను Chris అనే ఎప్పుడూ పిలిచేవారు. ఆయనకి కాలేజీలో ఉండేరోజుల్లో ఒక తెలుగు అబ్బాయి – గోపాలం – roommate గా ఉండే వాడట. ఏదో చిన్న పల్లెటూర్నించి వచ్చి, ఏఏచ లో చదువుకుని teaching assistant గా వచ్చాడట. వాడి ఇంగ్లీషు అసలెవ్వరికీ అర్ధమయ్యేది కాదట. ముఖ్యంగా వాడి students కి అర్థంగాక వెళ్ళి ప్రిన్సిపాల్‌తో కంప్లైన్‌కూడా చేసారట. అప్పుడు మా తాతయ్యే అతనికి కొంచం నెమ్మదిగా మాట్లాడాలని సలహా ఇచ్చి, వీలయినంతవరకూ అమెరికన్ యాక్సెంటుతో మాట్లాడటం నేర్పాడట . .

ఇప్పుడిక్కడ నాపరిస్తితీ కొంచం ఆ గోపాలం లాగానే ఉంది. మన న్యూయార్క్ ఎంత పెద్దవూరని మనమనుకున్నా, హైదరబాదుతో పోలిస్తే పల్లెటూరే కదా! ఆఫీసులో ఏమీ ఫరవాలేదు గాని బయట ఊరిలోకెడితే చాలా నెమ్మదిగా మాట్లడితేతప్ప నా తెలుగు ఎవరికీ అర్థం గాదు . . కానీ నెమ్మదిగా అలవాటవుతోందిలే . . ఇప్పుడు బాగానే వుంది.

ఎందుకైనా మంచిదీ, నువ్వు వీలయినంతమటుకు తెలుగు హైదరాబాదు యాక్సెంటుతో మాట్లాడటం ఇప్పడినించే నేర్చుకో! తెలుగు సినిమాలూ అవీ ఎలాగో చూస్తూనే వుంటావుగా (అసలు ఈ మధ్య ఇంగ్లీషు సినిమాలు చూసేట్టుగా ఉండట్లేదులే!), కాస్త ప్రయత్నం చేస్తే తేలికగానే వస్తుంది . . నిన్న మళ్ళీ మా బాస్ హరిగారి ఇంట్లో చిన్న

పార్టీకి పిలిచాడు. (ఆయన పేరు నిజంగా Harry ట, ఎవరో చెప్పారు; ఇక్కడ అటువంటి personal విషయాలు అడగరు, చెప్పరు). ఈ సారి ఆఫీసువాళ్ళెవ్వరినీ పిలవలేదు .. నన్నొక్కడినే. నేనంటే ఆయనకి ఎందుకో ఇష్టంగా ఉన్నట్లుంది. శైలజ కూడా అక్కడే వుంది పార్టీలో. ఇక్కడే పుట్టిపెరిగినా ఏమీ దురలవాట్లు లేవాపిల్లకి. హరిగారు, నేను, drinks తీసుకున్నా శైలజ (అసలు పేరు Sally .. గోడమీద certificateలో చూసాను) మాత్రం కోక్ మాత్రమే తీసుకుంది. భోజనాలయ్యాక పార్టీకి కారణం తెల్చారు – శైలజ పుట్టినరోజట. అందరం happy birthday పాడినతరువాత cake మీద candles వూదేసి ముక్కలు కోసి అందరికీ ఇచ్చింది. ఈ కార్యక్రమం అయిపోగానే శైలజ మర్నాడు పరిక్షలకి చదువుకోవాలని వెళ్ళడానికి లేస్తే హరిగారే కాసేపు కూర్చోమని బలవంతం చేసారు. కొంచంసేపు కూర్చుని కబుర్లు చెప్పి వెళ్ళింది. ఇక నాకుకూడా మర్నాడు చాలా పనుందని హరిగారికి చెప్పి నేనూ బయల్దేరాను.

కృష్ణ

oooooooooooooooooooooooooooooooo

కృష్ణా,

అసలు మీ హరిగారు వాళ్ళ అమ్మాయి పుట్టిన్రోజుకి నిన్ను ఎన్దుకు, పిలవడం? వాళ్ళ స్నేహితులనో, చుట్టాలనో పిలుచుకోవాలిగానీ! ఇది నాకేమీ బాగా లేదు, కృష్ణా! ఎదో కొంచం అమాయకుడిలా వున్నావుకాబట్టి వాళ్ళ అమ్మాయిని నీకంటగట్టాలని చూస్తున్నారనిపిస్తోంది. నువ్వు మాత్రం జాగ్రత్తగా వుండు! మళ్ళీ వాళ్ళింటికి పిలుస్తే ఏదో ఓ సాకు చెప్పి తప్పించుకో! నాకిదేమి నచ్చట్లేదు, చెపుతున్నా!

ఇక్కడ పని చాలా ఎక్కువగానే వుంది గాని ఏం పెద్ద తృప్తిగా లేకుండా వుంది. మనం కాలేజిలో చదివిన design, theory అంతా దండగ .. ఇక్కడ వీళ్ళుచేసేది ఏ high school పిల్లాడో చేయవచ్చును. high level design అంతా హైదరాబాదులోనే చేసేస్తారు. ఇంక రెండు మూడు నెలల్లో హైదరాబాదు వచ్చే ఛాంసు వస్తుంది – ఈ ప్రాజెక్టవ్వగానే. (అదే గనక రాకబోతే ఈ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేసి నీదగ్గరికి వచ్చేసి అక్కడే ఉద్యోగం వెతుక్కుంటా!).

జానకి

oooooooooooooooooooooooooooooooooooooooo

Dear జానకి,

నువ్వు మరీ ఇంతగా ఉడికితే ఎలాగు! చెప్పానుగదా, నాకు నువ్వుతప్ప మరెవ్వరూ అక్కరలేదని! పిచ్చిపిచ్చి అనుమానాలతో నువ్వు నీ మనసు పాడుచేసుకోకు!

మొన్న శనివారం క్రికెట్ మాచ్‌చూడటానికి వెళ్ళాము. ఓ సారి చెప్పానే, ఇక్కడ sports పిచ్చి చాలా వుందని? ఈ క్రికెట్ పిచ్చి మిగతావాటన్నిటికంటే ఎక్కువ. చూడటానికి కొంచం మన baseball లాగా వుంటుంది గానీ చచ్చే బోరు! కానీ ఏదో వీళ్ళతో కలిసిపోవడానికి నచ్చినట్లు నటించాలి! నీదే అదృష్టం .. baseball చూడవచ్చు! మన yankees results అన్నీ ఇంటెర్నెట్లో చూస్తూనే ఉన్నాను గానీ, ఆటలు కూడా చూడగలిగితే ఎంత బాగుండేది. హరిగారింట్లో cable TV లో వస్తాయట .. నా బాధ చూసి కాబోలు, ఈ సారి పిలుస్తానులే అని చెప్పారు. నువ్వేమీ భయపడనక్కరలేదులే, శైలజకి ఇప్పుడు పరీక్షలు, రోజా లైబ్రరీకి వెళ్ళి చదువుకుంటోంది.

ఇక్కడ పనికూడా చాలా ఎక్కువౌతున్నది. మళ్ళీ వీలుచూసుకుని వ్రాస్తాను ..
కృష్ణ

oooooooooooooooooooooooooooooooooo

Dear కృష్ణా,

రెండు వారాలవుతోంది నీదగ్గరనుంచి email వచ్చి, అంత బిజీ గా ఉన్నావా!? నాకూ ఇక్కడ పని ఎక్కువవడంతో తీరికగా కూర్చుని వ్రాసే సమయం దొరకటల్లేదు. ఆఫీసులోనైతే personal email వ్రాయకూడదని రూలు పెట్టారు. అలసిపోయి ఇంటికొచ్చేశరికి త్వరగా భోంచేసి పడుకోవడమే అవుతోంది. నీకుకూడా అంతేనేమో పాపం ..

ఇక్కడ మాకొక క్రొత్త మానేజర్‌హైదరాబాద్‌నుంచి వచ్చాడు. పాపం మా పాత మానేజర్ని తీసేసారు .. ప్రాజెక్టు సరిగ్గా సమయానికి రావటలేదని. అందరికీ భయం

భయంగా ఉంది. ఇప్పటివరకూ నాతో బాగానే ఉంటున్నాడు .. చూద్దాం, అంతగా ఉద్యోగంలోంచి తీసేస్తే వేరే ఉద్యోగం చూసుకుంటాను ..

జానకి

ooooooooooooooooooooooooooooooooo

డియర్‌కృష్ణా,

అనుకున్నంత పనీ అయ్యింది .. ఇక్కడ డివిజన్‌అంతా మూసేసారు. నష్టాలు చాలా వస్తున్నాయట, ఈ ఉద్యోగాలన్నీ చైనాలో ఒక క్రొత్త కేంద్రం తెరిచి అక్కడ చేయిస్తారట. నిజంగా మీ హైదరాబాదు వాళ్ళు చాలా గట్టివారే. ఈ globalization వచ్చినప్పటినుంచీ అమెరికాలాంటి దేశాలలో కష్టాలు పెరుగుతున్నాయేగాని మనకేమీ లాభం కనిపించటలేదు.

నీ దగ్గరనుంచి email వచ్చి చాలా రోజులయింది. చెప్పు కృష్ణా, ఏం చెయ్యమంటావు? నా పాస్పోర్ట్‌వచ్చింది. హైదరాబాదు వచ్చేసి అక్కడే ఎదైనా ఉద్యోగం వెతుక్కోవచ్చునేమో? భారత దేశం వీసా రావాలంటే ఇప్పుడు చాలా కష్టమంటున్నారు. అక్కడ ఉద్యోగముంటేనో, లేక అక్కడివాళ్ళెవరన్నా sponsor చేస్తేనో గాని ఇవ్వరట. నాకు త్వరగా ఆ స్పాన్సర్‌పత్రాలు ఎంపగలవా?

జానకి

ooooooooooooooooooooooooooooooooooooo

డియర్ జానకీ,

నువ్వక్కడ తొందరపడద్దు! ఇక్కడ నా సంపాదన మీద ఇద్దరం ఉండటం చాలా కష్టం. అసలు నా ఆదాయం చూసి వాళ్ళు నీకు వీసా కూడ ఇవ్వకబోవచ్చు. ఇక్కడ కూడా మన అమెరికావాళ్ళకి ఉద్యోగాలు దొరకడం కొంచం కష్టం అవుతున్నది. ఇక్కడి యూనియన్ వాళ్ళు గొడవచేస్తున్నారు, ఉద్యోగాలన్నీ చవకగా పనిచేసే అమెరికన్లకి వెళ్ళిపోతున్నాయని. మొన్న పార్లమెంటులో ఒక పెద్ద గొడవయ్యి పచ్చపత్రాల సంఖ్య చాలా తగ్గించాలని నిర్నయించారు! ఇంక ఇక్కడ భారత దేసపు సిటిజన్‌ని పెళ్ళిచేసుకుంటే గాని పచ్చపత్రం వచ్చేటట్లు లేదు! (జోక్‌చేస్తున్నానోయ్)

కృష్ణ

oooooooooooooooooooooooooooooooooooooooo

డియర్‌కృష్ణా,

నెలరోజులు దాటింది నీదగ్గరనుంచి email వచ్చి . . ఏం చేస్తున్నావు?

ఇక్కడ వేరే కంపెనీలో ఉద్యోగం దొరికింది. మంచి ఉద్యోగమే గాని భారతదేశం వెళ్ళే అవకాసం మాత్రం లేదు. అయినా ఇదే హాయిగా వుంది . . అంత ప్రెషర్‌లేకుండా వుంది.

మన కాలేజిలో జనార్ధన్‌అని ఉండేవాడు గుర్తున్నాడా? మొన్న ఓ రోజు కనిపించాడు. ఇద్దరం సినిమాకి వెళ్ళాం. అక్కడ మీ శైలజ ఏమంటోంది? ఆమె పరీక్షలయ్యాయా?

జానకి

oooooooooooooooooooooooooooooooooooooooo

డియర్‌కృష్ణా,

మొన్న మళ్ళీ Jonathan తో సినిమాకెళ్ళాను. తెలుగు సినిమానే . . నీ లాంటి కేసే . . ఎవడో అమెరికన్‌కుర్రాడు హైదరాబాదు వచ్చి అక్కడొకమ్మాయిని ప్రేమించి అమెరికాలో వదలిపెట్టిన ప్రియురాలిని మరచి పోతాడు. కానీ కథ సుఖాంతం కాదు . . సినిమానుంచి బయటకి వచ్చాక నాకు చాలా బాధగా వుండింది! ఎలాగో మనమిద్దరం ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయేట్టుగా ఉన్నాము . . మరేమీ పరవాలేదు, ఇద్దరమూ స్నేహితులుగానే మిగిలిపోదాము . . కానీ అప్పుడప్పుడు email వ్రాస్తూ ఉండు, కృష్ణా . .

జానకి

oooooooooooooooooooooooooooooooooooooooo

Dear Jane,

నేను కృష్ణా బాస్‌Harryని. వాడి application formలో మీ email address ఉంటే తీసుకుని ఈ email వ్రాస్తున్నాను. అయినదాన్లో చాలామటుకూ

నా తప్పే వుంది కాబట్టి నేనే వ్రాస్తే బాగుంటుందని మొదలుబెట్టాను. దయచేసి పూర్తిగా చదవండి.

కృష్ణా చాలా మంచివాడు. అతనిని చూసినప్పుడే మా Sallyకి సరిపోతాడని అనిపించింది. ఇన్నాళ్ళు ఈ పరాయిదేశంలో ఉంటూ మనదేసపు మన్చి కుర్రాడ్ని చూసేసరికి నాకు చాలా సంతోషం కలిగింది. వీలయినంతమటుకూ వాళ్ళిద్దరినీ కలపాలని చూసాను. భారతదేసపు పౌరుడ్ని పెళ్ళిచేసుకుంటే నీకే మంచిదని శలహా కూడా నేనే ఇచ్చాను. (ఇక్కడ ఇన్నాళ్ళు ఉన్నందుకు గాబోలు, ఈ "arranged marriages" బుద్ధి నాకూ పుట్టింది!). వాడికిష్టం లేకపోయినా బాసుగా నా మాట కాదనలేక నే పిలిచినప్పుడల్లా ఇంటికీ, పార్టీలకీ వచ్చాడు.

కానీ శైలజ మాత్రం పూర్తిగా తెలుగు పిల్లే. చిన్నప్పడినుంచీ వాళ్ళ అమ్మ, తాతయ్య నూరిపొయ్యడంతో చాలా traditionalగా పెరిగింది. మీరక్కడ అమెరికాలో ఉంటూ ఇక్కడివాళ్ళంతా ఏదో చాలా ప్రగతిచెందినవారని అనుకుంటూ ఉండుంటారు. వైజ్ఞానికంగా ప్రగతి చెందినా, వీళ్ళ వ్యక్తిగత విషయాలలో మాత్రం వాళ్ళ సంస్కృతి, వాళ్ళ ఆచారాలు ఇంకా ఏమీ మార్చుకోలేదు. ఒకవిధంగా చూస్తే మెచ్చుకోదగ్గ విషయమే. కానీ నేననుకున్నది మాత్రం జరగలేదు. శైలజ భారతదేశంలో పుట్టి పెరిగిన వాడిని గాని చేసుకోనని భీష్మించుకుని కూర్చుంది. అంతటితో ఆగితే నేనేదో సర్దిచెప్పి విషయం ఇంతదూరం రాకుండా చూసేవాడిని. కానీ వాళ్ళమ్మకి ఈ విషయం తెలిసి, పెళ్ళి పాపం Chris ని నానా చివాట్లూ పెట్టింది. Chris వట్టి అమాయకుడు, చాలా బాధపడిపోయి ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేసి అమెరికా వెళ్ళిపోతానని అంటున్నాడట. వాడితో బాటు barకి వెళ్ళిన వాడి colleagues నాతో చెప్పారు.

Chrisకి నిజంగా నువ్వంటే చాలా ఇష్టం. మీరు సరేనంటే ఇక్కడ మైక్రోసాఫ్ట్లో మీకూ ఉద్యోగం ఇప్పిస్తాను. వీసా కూడా తేలికగానే వస్తుంది (ఇది కూడా భారతీయుల పాతకాలపు అలవాటే .. కొంచం లంచమిస్తే ఏదైనా చేయించవచ్చు). వాడికిప్పుడు మీ అవసరం చాలా వుంది. వెంటనే ఉత్తరం వ్రాయండి.

Sincerely
Harry

oooooooooooooooooooooooooooooooooooooooo

డియర్ కృష్ణా,

మీ బాసు వ్రాసిన ఉత్తరం చూసి అంతా తెలుసుకున్నాను. ఏదో ఇటువంటి విశేషమే ఉండుంటుందని అనుకుంటునే ఉన్నాను. అందుకనే ఈ Jonathan విషయం కూడా ఊరికే కల్పించి నీకు చెప్పాను - ఏమంటావో చూద్దామని.

తెలుగు పిల్లని కాకపోయినా నాకూ పౌరుషం ఉంది .. మీ బాసు ఉద్యోగమూ, వీసా ఇప్పిస్తానంటే వెంటనే అన్నీ వదిలేసి నీ దగ్గరకి పరుగెత్తుకుని వస్తానన్కుకుంటున్నాడు. నాకింకా అంత గతి పట్టలేదు. Please, నీ దారిన నువ్వు వెళ్ళిపో, నన్ను విసిగించకుండా వదిలేసెయ్యి!

ఇట్లు
జానకి

oooooooooooooooooooooooooooooooooooooooo

Dear Jane,

నేను మొన్న పంపిన emailకి ఇంకా మీ దగ్గరనుంచి జవాబు రాలేదు. ఆ రోజు నుంచీ కృష్ణ ఆఫీసుకి రాలేదు. ఇంటికి ఫోనుచేస్తే డిస్కన్నెక్టెడ్అని వచ్చింది. మీరేమైనా వాడికి వ్రాసారా? నాకు కొంచం భయంగా ఉంది .. వెంటనే తిరిగి email పంపించండి!

Sincerely
Harry

oooooooooooooooooooooooooooooooooooooo

హరిగారు,

నన్ను మీ emailలతో విసిగించడం ఆపేయండి. కృష్ణ ఏమీ పసిపిల్లాడు కాడు. అతని సంగతి నాకిక అఖరలేదు ..

హరిగారు,

నేను కృష్ణని, మా జానకి మొదలుబెట్టిన email పూర్తి చేస్తున్నాను. ఇప్పుడే ప్లేను దిగి సరాసరి జానకి ఇంటికే వచ్చి తలుపుకొడితే చాలా ఆశ్చర్య బోయింది! గట్టిగా కౌగలించుకుని చెప్పాను – జానకీ, నువ్వుతప్ప నాకెవ్వరూ అఖరలేదు, ఆ వెధవ ఉద్యోగం ఎందుకు, హాయిగా ఇక్కడే మనమిద్దరమూ కలసి ఉందామని. ఇప్పుడంతా సరియైపోయింది.

చిన్నప్పడినుంచీ తెలుగులో మాట్లాడుతూ, తెలుగు సాహిత్యం చదువుతూ, తెలుగు సినిమాలు చూస్తూ వచ్చిన నాకు చాలమటుకూ తెలుగు విలువలే వంటపట్టినట్టున్నాయి! మీకాలంలో అమెరికాలో ఎలా వుండేవారో గాని, నాకుమాత్రం నేను ప్రేమించిన జానకి నాతో లేకబోతే తోచటల్లేదు. ఎంతగొప్ప దేశమైనా, ఎంతపెద్ద ఉద్యోగమైనా, జానకి లేకబోతే నాకక్కరలేదు. నిజంగా మీకు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. మీ కుట్రలతో నాకు జ్ఞానోదయం కలిగించారు. ఇక మీకూ, మీ ఉద్యోగానికి ఓ దణ్ణం .. మళ్ళీ మా ఇద్దరికీ వ్రాయకండి!

కృష్ణ